- వడ్లన్నీ వానపాలు



సిద్దిపేట జిల్లా దుబ్బాక మార్కెట్ యార్డులో వర్షానికి తడిసిన ధాన్యాన్ని తీస్తున్న రైతులు

- నిండాముంచిన వాన



మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలో ధాన్యం కుప్పలపై కూర్చొని నిరసన తెలుపుతున్న రైతులు

- కాలువలో కష్టార్జితం



మంచిర్యాల జిల్లాలో ధాన్యం కుప్పలపై నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతు

# రాష్ట్రాన్ని ముంచెత్తిన వాన

మొదటిపేజీ తరువాయి...

చేశారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలో, సిద్దిపేట జిల్లా వర్గల్‌లో వర్షానికి ధాన్యం తడిసిపోయింది. మెదక్ జిల్లా కొల్చారం, చిలిపిచెడ్, నిజాంపేట్, రామాయంపేట్ మండలాల్లో, సంగారెడ్డి జిల్లా జిన్నారంలో వడ్లు తడిశాయి. మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో ఆరుబయట ఉన్న ధాన్యం, మొక్కజొన్న కుప్పలు తడిసిపోయాయి. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి, దుబ్బాక మార్కెట్ యార్డుల్లో ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడ్డారు. గజ్వేల్ రింగ్‌రోడ్డు వెంబడి అరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయింది. రోడ్డు వెంబడి కొట్టుకపోతున్న వడ్లను రైతులు ఒకదగ్గరకు చేర్చుతున్నారు. సింగాటం, శ్రీగిరిపల్లి, అహ్మదీపూర్, బూరుగుపల్లి, దిలాల్‌పూర్, శేర్‌పల్లి గ్రామాలకు వెళ్లే మార్గాల్లో రోడ్ల వెంబడి ఆరబెట్టిన వడ్లుదీ దాదాపు ఇదే పరిస్థితి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ కొనుగోలు కేంద్రాల్లో వడ్ల రాశుల చుట్టూ నీరు నిలిచి రైతులు ఇబ్బందులు పడ్డారు. కరీంనగర్ మార్కెట్ యార్డులోనూ ఆరబోసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆగమాగమయ్యారు.



కరీంనగర్‌లోని మార్కెట్ యార్డులో గురువారం కురిసిన వానకు తడిసిన ధాన్యాన్ని దగ్గరికి చేస్తున్న రైతులు



చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో వర్షపు నీటికి కొట్టుకుపోయిన ధాన్యం



భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డిలో ధాన్యం కుప్పల చుట్టూ చేరిన వర్షపు నీరు



చేవెళ్లలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం

# గాలివాన బీభత్సం

- విరిగిన విద్యుత్తు స్తంభాలు, చెట్లు
- నిలిచిపోయిన కరెంటు సరఫరా
- రోడ్లపై స్తంభించిన రాకపోకలు

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్ : రాష్ట్రంలో గురువారం గాలివాన బీభత్సం సృష్టించింది. చాలా చోట్ల ఈదురుగాలులతో విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి. ఇంటి పైకప్పులు లేచిపోయాయి. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలో వడగళ్ల వర్షం పడింది. ఇంద్రవెల్లి మండలంలో భారీ వృక్షాలు నెలకొరిగాయి. ఈశ్వర్‌నగర్ సమీపంలో ప్రధాన రోడ్డుపై చెట్టు విరిగి పడిపోవడంతో గంట సేపు రాకపోకలు స్తంభించాయి. ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న వాహనాలు నిలిపోవడంతో అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సునీల్ స్థానికుల సహాయంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించారు.ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గంటపాటు మోస్తరు వర్షం కురిసింది.దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు వీచాయి. గజ్వేల్‌లో చెట్టుకింద నిలిపిన కారుపై చెట్టు విరిగిపడడంతో కారు దెబ్బతిన్నది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మహదేవునిపేట నుంచి గంగారం వెళ్లే ప్రధానరహదారిపై చెట్టు విరిగిపడింది. సిరిసిల్లలోని సంజీవయ్యనగర్, నేతన్న చౌక్‌లో వర్షపు నీరు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలులకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో పట్టణమంతా అంధకారం అలుముకుంది.



మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి మార్కెట్‌యార్డులో ధాన్యం కుప్పలపై కప్పిన కవర్లు

# మరో 5 రోజులు వర్షాలు

- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు
- ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం
- క్యుములోనింబస్ మేఘాల ప్రభావం
- నగరంతో పాటు పలు జిల్లాల్లో వర్షం
- వాతావరణ శాఖ వెల్లడి

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వాతావరణ శాఖ సూచించినట్టుగానే.. హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. మధ్యాహ్నం రెండింటి వరకు ఎండ రాగా.. ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. క్యుములోనింబస్ మేఘాలు కమ్ముకుని..ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్టుగా భారీ వర్షం కురిసింది. రాష్ట్రంలో రాగల ఐదు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ ఐదు రోజులు పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను వాతావరణ శాఖ జారీ చేసింది. బుధవారం తూర్పు విదర్భ పరిసర ప్రాంతాలలో కొనసాగిన ఆవర్తనం గురువారం మధ్యప్రదేశ్ నైరుతి ప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్నట్టు పేర్కొన్నది. ఆవర్తనం ప్రభావంతోనే రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నట్టు వెల్లడించింది. ఉష్ణోగ్రతల విషయానికొస్తే.. ముందున్నంత ఎండలు ఉండకపోవచ్చని, గరిష్ఠంగా 43డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించింది.

## ఈ ఏడాది ఆశాజనకంగా వర్షాలు

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ ): తెలుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. గత ఏడాది అంతంత మాత్రంగానే కురిసిన వర్షాలు.. ఈ ఏడాది ఆశాజనకంగా ఉంటాయని తెలిపింది. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాలలో ముందస్తు రుతుపవన వర్షాలు (ప్రీ మాన్‌సూన్ రెయిన్స్) ప్రారంభమయ్యాయి. దక్షిణ విదర్భ నుంచి కర్ణాటక వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగనున్నట్టు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. నైరుతి బంగాళాఖాతంలో శ్రీలంక వద్ద ఉపరితల ద్రోణి తాకనుంది. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణ, ఏపీలో వర్షాలు కొనసాగుతున్నాయి. నైరుతి రుతుపవనాలు మే 31న కేరళకు వచ్చే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాతే.. తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని విశాఖ వాతావరణ శాఖ అధికారి సునంద పేర్కొన్నారు. ఈసారి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేశారు.

# పిడుగుపాటుకు ముగ్గురి మృతి

రాజన్న సిరిసిల్ల/కడ్తాల్, మే 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా గురువారం కురిసిన భారీ వర్షాలకు అక్కడక్కడ పిడుగులు పడి ముగ్గురు మృతి చెందారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పిడుగుపాటుకు ఇద్దరు మృత్యువాతపడ్డారు. తంగళ్లపల్లి మండలం భరత్‌నగర్‌కు చెందిన రామడుగు చంద్రయ్య(42) పొలం పనులు చేస్తుండగా పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజ్‌పల్లికి చెందిన కంబాల శ్రీనివాస్(40) గురువారం చింతకాయలు తెంపేందుకు వెళ్లాడు. చెట్టు కింద శ్రీనివాస్‌తో పాటు మరో నలుగురు ఉండగా పిడుగుపడింది. శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కలకొండ గ్రామానికి చెందిన పసునూరి ప్రవీణాచారి (30) కార్పెంటర్. గురువారం మామ జంగయ్యాచారితో కలిసి బైక్‌పై కడ్తాల్ వెళ్లి వస్తూ వాన రావడంతో వాసుదేవ్‌పూర్ గేట్ బస్‌షెల్టర్ వద్ద ఆగారు. ఇదే సమయంలో పిడుగుపడటంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. జంగయ్యకు ఎలాంటి గాయాలూ కాలేదు. కానీ బస్సు షెల్టర్ ఎదుట నిలబడిన మాడ్గుల్‌కు చెందిన గౌని నిరంజన్‌గౌడ్‌కి తీవ్రగాయాలయ్యాయి. అతడిని పోలీసులు కల్వకుర్తి ప్రభుత్వ దవఖానకు తరలించగా, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కి తరలించారు. మరో ఘటనలో మెదక్ జిల్లా రామాయంపేట మండలం డి.ధర్మారంలో జెల్ల యాదగిరి అనే రైతుకు చెందిన ఆవుపై పిడుగు పడి అవు అక్కడిక్కడే మృతి చెందింది.

# మహానగరంలో కుండపోత

## గ్రేటర్ హైదరాబాద్ అతలాకుతలం

**ఏకధాటిగా రెండున్నర గంటల వాన.. 5 సెం.మీ. మించి వర్షపాతం**



హిమాయత్‌నగర్‌లో రోడ్డుపై వరద నీటి తాకిడికి ఇబ్బంది పడుతున్న మహిళ

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మే 16 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరాన్ని ఒక్కసారిగా కుంభవృష్టి ముంచెత్తింది. నిన్నటి దాకా ఉక్కపోతతో అల్లాడిన జనం గురువారం కుండపోత వానకు విలవిలలాడారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి దాదాపు రెండున్నర గంటలు వాన దంచికొట్టింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి వరద నీరు రహదారులను ముంచెత్తింది. నగర ట్రాఫిక్ స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కాగా జనజీవనం అస్తవ్యస్తమైంది. కొన్నిచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడినా అదృష్టవశాత్తు గ్రేటర్‌వ్యాప్తంగా ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదు. నగరానికి భారీ వర్ష సూచన అంటూ వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా అధికార యంత్రాంగం అప్రమత్తత లేకపోవడంతో వాహనదారులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి ప్రత్యక్ష నరకాన్ని చూశారు. ట్రాఫిక్ కానిస్టేబుళ్లే ఓ వైపు వరద నీటిని తొలిగిస్తూ, మరో వైపు ట్రాఫిక్ క్లియరెన్స్ చేస్తూ నగరంలో కనిపించారు. అత్యధికంగా బంజారాహిల్స్‌లో 8.75 సెం.మీ. వర్షపాతం నమోదైంది. నగర వ్యాప్తంగా దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ 5 సెం.మీ. అంతకుమించి వర్షపాతం నమోదు కాగా, శివారు ప్రాంతాల్లో 1-3 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

### 63 చోట్ల నిలిచిన వరద నీరు

నగరంలో భారీ వర్షానికి 63 చోట్ల వరద నీరు నిలిచి జనం ఇబ్బందులు పడ్డారు. ఒక్కసారిగా హోరున కురిసిన వర్షంతో డీఆర్ఎఫ్ బృందాలు కూడా వెంటనే అక్కడికి చేరుకోలేకపోయాయి. దీంతో నిజాం కాలేజీ, మలక్‌పేట రైల్వే అండర్ బ్రిడ్జి, మలక్‌పేట మార్కెట్, చంపాపేట డీమార్ట్, బేగంపేట, తిరుమలగిరి, సికింద్రాబాద్, మాసబ్‌ట్యాంక్, మూసరాంబాగ్ బ్రిడ్జి... ఇలా అనేకచోట్ల భారీ ఎత్తున రోడ్లపై వరద నీరు నిలిచింది. దీంతో కొన్ని చోట్ల దాదాపు 30-45 నిమిషాల పాటు వాహనాలు రోడ్డు దాటే పరిస్థితి లేకుండాపోయింది. మలక్‌పేట రైల్వే అండర్ బ్రిడ్జి దగ్గర రోడ్డుపై ప్రవహిస్తున్న వరదతో రాకపోకలు నిలిచిపోయి..ఐదారు కిలోమీటర్లు ట్రాఫిక్ జాం నెలకొంది. సా.5 గంటల వరకు నగరంలో ఎక్కడా వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొన్నది. జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ బృందాలు, ట్రాఫిక్ పోలీసులు వరద నీరు నిలిచే ప్రాంతాలకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టడంతో పరిస్థితి కాస్త అదుపులోకి వచ్చింది. అయినప్పటికీ రాత్రి 8 గంటల వరకు చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య అదే విధంగా కొనసాగింది.



బేగంపేటలో ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన వాహనాలు

### కొట్టుకుపోయిన రిటైనింగ్ వాల్

**భారీ వర్షానికి** బంజారాహిల్స్ పరిధిలోని ఉదయ్‌నగర్‌లో నాలాపై ఉన్న రిటైనింగ్ వాల్ కొట్టుకుపోయింది. దీంతో అక్కడ రోడ్డు కుంగిపోయింది. డీఆర్ఎఫ్ బృందాలు వెంటనే అప్రమత్తమై చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ రొనాల్డ్‌రాస్ సంఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. అంబర్‌పేట, ముషీరాబాద్, కృష్ణానగర్, శ్రీనగర్ కాలనీల్లో ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. రాత్రి 8 గం వరకు జీహెచ్ఎంసీ టోల్‌ఫ్రీ నెంబరుకు 82 ఫిర్యాదులు వచ్చాయి. లోతట్టు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.